క్లుప్తంగా

దంచి కొట్టిన వాన



గురజాల : నగర పంచాయతీ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం వల్ల పలు రహదారులు జలమయమయ్యాయి. ఏ వీధిలో చూసినా వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తూ కనిపించింది. డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. కారెంపూడి రహదారితో పాటు పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్డుపై పారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది.

రెంటచింతల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నగేష్



రెంటచింతల: రెంటచింతల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కె.నగేష్‌ను నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నగేష్ ప్రస్తుతం గురజాల తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జి.కరుణకుమార్ గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారుల సహకారంతో మండల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

శిక్షణ తరగతులు రద్దు చేయాలి



మాచర్ల: పల్నాడు జిల్లాలోని ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కొమ్ము కిషోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి ఆరు రోజులపాటు 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించటం సమంజసం కాదన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతులు పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో మాచర్ల మండల శాఖ అధ్యక్షులు కుంభా పోతురాజు, సుధాకర్, మధుబాబు, అనిల్, కోటేశ్వరరావు, ప్రసాద్, హుస్సేన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా నిరుద్యోగులకు పెద్ద వరం



మాచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్య సంస్థ నిరుద్యోగుల కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని ప్రభుత్వ ఎస్‌కేబీఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ కుమారి చెప్పారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాకు పల్నాడు జిల్లా నైపుణాధికారి తమ్మాజీరావు అధ్యక్షత నిర్వహించారు. మూడు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. 60 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. మేళాకు మొత్తం 76 మంది నిరుద్యోగులు హాజరైతే 60 మందికి ఉద్యోగాలు రావడం గమనార్హం. కార్యక్రమంలో నైపుణ్య సంస్థ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎం.రవీంద్ర నాయక్, మాచర్ల కో–ఆర్డినేటర్ ఆర్.కిరణ్, పి.శ్రీకాంత్, ఆయా కంపెనీల హెచ్ ఆర్‌లు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



మాచవరం: పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పిన్నెల్లి, గంగిరెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో సీసీ రోడ్లకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పిన్నెల్లి గ్రామానికి రూ.21 లక్షలు, గంగిరెడ్డిపాలెం గ్రామానికి రూ.15 లక్షలు, మాచవరం గ్రామానికి రూ.20 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు , ఈఓపీఆర్‌డీ వెంగళరావు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

భార్య మృతికి కారకుడైన భర్తకు రిమాండ్

నరసరావుపేటటౌన్: భార్య మృతి కేసులో భర్తకు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ కాలనీకి చెందిన షేక్ ఖాజా భార్య జానీ బేగం 2020లో భర్త వేధింపులు భరించలేక ఉరివేసుకుని మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడైన భర్తను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడికి రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

చతికిలబడిన చదువులు

వెల్దుర్తి మండలంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రం

- కనీసం ఒక్క టీచర్ కూడా లేని బడులు ఏడు
- ఏకోపాధ్యాయ పాఠశాలలు 13
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వెల్దుర్తి మండల విద్యా వనరుల కేంద్రం

వెల్దుర్తి: వెల్దుర్తి మండలాన్ని ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వెంటాడుతోంది. ఫలితంగా బడి చదువులు చతికిలపడ్డాయి. మండలంలో 37 ప్రైమరీ స్కూళ్ళు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 జిల్లా ఉన్నత పాఠశాలలతోపాటు, ఒక ఏపీమోడల్ స్కూల్, 2 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 6 పీటీజీ స్కూళ్ళు, 3 జీపీఎస్ స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 4,447 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో 205 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. కానీ ప్రస్తుతం 120 మంది మాత్రమే ఉన్నారు. 85 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలలు 13 ఉండగా, అసలు ఒక్క ఉపాధ్యాయుడూ లేని బడులు ఏడు ఉన్నాయి. దీనిని బట్టి ఉపాధ్యాయుల కొరత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. దీంతో చిన్నారుల చదువులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కొన్ని సబ్జెక్టులకు నిపుణులైన టీచర్లు లేరు. ఫలితంగా విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. గతంలోనూ ఉపాధ్యాయుల కొరత ఉన్నా.. విద్యావలంటీర్లు బోధించే వారు. కానీ ఇప్పుడు వలంటీర్లు లేరు.

విద్యాబోధన ఎలా సాధ్యం



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంటే విద్యాబోధన ఎలా సాధ్యం? ప్రతి పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ, టీచర్లు తక్కువ. కోట్ల రూపాయలు వెచ్చించి పాఠశాలలు నిర్మిస్తున్నారు. టీచర్లు లేకపోతే విద్యార్థులకు ఏం మేలు జరుగుతుంది. మా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలంటే భయమౌతుంది.

– గార్లపాటి వెంకట్రామయ్య, రచ్చమల్లపాడు

కొరత వాస్తవమే



మండలంలోని 57 పాఠశాలల్లో 4,447 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి విద్యాబోధన చేసేందుకు 205 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 120 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 85 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఉపాధ్యాయులతోనే విద్యార్థులకు బోధన చేస్తున్నాం. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.

– కాంతారావు, ఇన్‌చార్జి ఎంఈఓ

పోస్టులు భర్తీ చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బడిలో ఎక్కువ మంది విద్యార్థులు, తక్కువ మంది టీచర్లు ఉండటం వలన పిల్లలకు విద్యాబోధన చేయటం కష్టంగా ఉంది.. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని చెబుతున్న ప్రభుత్వం ముందు వాటిల్లో టీచర్ల పోస్టులు భర్తీ చేయాలి.

– అలుగుమల్లి వెంకటరెడ్డి, శిరిగిరిపాడు

విద్యా వలంటీర్లను నియమించాలి



ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించి పిల్లలకు పాఠాలు చెప్పించాలి. అన్ని తరగతులకు ఒక మాస్టారు బడి చెప్పటం సాధ్యం కాదు. అన్ని తరగతులకు టీచర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలి. పిల్లలు పాఠాలు చదవకపోతే బడులకు పంపినా ఉపయోగం ఉండదు.

– వడితె దిబ్బానాయక్, చిన పర్లపాయి తండ

గురజాల ఆర్‌ఐగా శ్రీనివాసరావు

గురజాల రూరల్ : మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్‌ఐ)గా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన మాచర్ల తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు వచ్చారు. ఇప్పటివరకు గురజాల ఆర్‌ఐగా విధులు నిర్వహించిన రమణ బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును పలువురు సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

మాచర్ల: భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్యానికి మొదటి ప్రాధాన్యమిస్తూ అన్ని ప్రాంతాలలో నీటి నిల్వలను తొలగించి కాల్వలు శుభ్రపరుస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన ప్రజలకు ఇబ్బంది కలగకుండా లోతట్టు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశామని చెప్పారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

మాచవరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు క్షమారాణి తెలిపారు. 19న శ్రీరుక్మిణీపురం, 21న మోర్జంపాడు, 22న కొత్తపాలెం, తురకపాలెం, 23న మల్లవోలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఆయా గ్రామాల రైతులు సమస్యల పరిష్కారం కొరకు అర్జీలు అందజేస్తే, నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు.

మాక్ పోలింగ్‌తో నాయకత్వ లక్షణాలు

శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: మాక్ పోలింగ్ కార్యక్రమాలు నిర్వాహణ వలన ఉత్తమ పౌరులుగా, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో యాక్టిజెన్ క్లబ్ వారి సౌజన్యంతో మాక్ పోల్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశ్ ఆప్నాయెన్ సహయోగ్ ఫౌండేషన్ ద్వారా 6వ తరగతి విద్యార్థులకు మాక్ పోల్ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఎన్నికల భావనను పరిచయం చేయడానికి ప్రజాస్వా మ్యం ప్రభుత్వం పార్లమెంటు పాత్రపై అవగాహన కల్పించి భవిష్యత్‌లో యువ ఓటర్ల మీరేనన్నారు. అలాగే దేశంలోని విలువైన పౌరసత్వ ఆదర్శాలను విద్యార్థులు నేర్చుకుంటారన్నారు. అనంతరం అధ్యక్షులుగా ఎన్నికైన కొత్తపల్లి మేఘన, ఉప అధ్యక్షురాలుగా అమృతపూడి ఆరాధ్యలు చేత ప్రమాణ స్వీకారం చేయించి పత్రాలు అందజేసినట్లు స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుబాబు, భువనేశ్వరి, కుమ్మరి శ్రీనివాసరాజు, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చదలవాడకు దురహంకారం పనికిరాదు

- కనీసం కార్మికులను పలకరించక పోవటం శోచనీయం
- రాజకీయ కారణాలతో తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి
- రిలేదీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్



శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న విజయకుమార్

నరసరావుపేట: గత ప్రభుత్వంలో కోర్కెల సాధనకోసం ఆందోళన చేసే కార్మికులకు మద్దతు పలికి అప్పటి ఎమ్మెల్యే దురహంకారంతో ప్రవర్తిస్తున్నా దని విమర్శించిన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గత పదిహేను రోజుల నుంచి ఆందోళన చేస్తున్న వారిని కనీసం పలుకరించకపోవటం శోచనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పేర్కొన్నారు. రాజకీ య కారణాలతో తొలగించిన కార్మికులు తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కార్యాల యం ఎదుట నిర్వహిస్తున్న రిలేదీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలి పారు. వీరిపట్ల స్థానిక ఎమ్మెల్యే చదలవాడ, కమిషనర్ జస్వంతరావులు శోచనీయంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే తన కుటుంబం వామపక్షాల భావాలు కలిగి ఉందని చెబుతుంటారని, వాస్తవానికి ఆ భావాలు ఉంటే కార్మికులను తొలగించే వారు కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరికి నచ్చిన పార్టీకి వారు ఓట్లు వేసుకుంటారని, తమ పార్టీకి ఓట్లువేయలేదనే కారణంతో గత పదేళ్ల నుంచి పనిచేస్తున్న వారిని తొలగించటం సబబుకాదు అన్నారు. కార్మికులకు పనులు చెప్పి చేయించుకునే కమిషనర్ ఇప్పుడు ఎమ్మెల్యేతో ఒక మాట చెప్పిస్తే వీరిని విధుల్లోకి తీసుకుంటామనటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఇతర పార్టీలు, యూనియన్ల మద్దతుతో తమ ఆందోళనను ఉధృతం చేసి మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగ నాయకులు అల్లాభక్షు, ఉద్యోగులు తది తరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

రొంపిచర్ల: మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలో రొడ్డు పై వస్తున్న ఆవును తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రొడ్డు పక్కకు దిగి కూరుకు పోయిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభం కూడా ఉంది. బస్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టకుండా బస్సును నిలువరించా డు. ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామం నుండి ప్రయాణికులతో నరసరావుపేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం స్తంభవించింది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగక పోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే రోడ్డుపై వేగంగా రావాల్సిన అవసరం ఏముందని స్థానికులు డ్రైవర్‌ను ప్రశ్నించారు. ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదుగా అన్ని డ్రైవర్ స్థానికులకు నిర్లక్ష్య సమాధానం ఇచ్చారు. నిర్లక్ష్య సమాధానానికి స్థానికులు డ్రైవర్‌పై అగ్రహం వ్యక్తం చేశారు.

డీఎం పిచ్చయ్య సేవలు అభినందనీయం



మాచర్ల: డిపో మేనేజర్‌గా మూడేళ్ల పాటు ఉత్తమ సేవలు అందించిన మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య ఆదర్శనీయుడని ఎంఎస్‌యూ జిల్లా నాయకుడు మురారి కొనియాడారు. శుక్రవారం బదిలీపై వెళుతున్న డీఎం పిచ్చయ్యను సత్కరించారు. మూడేళ్ల పాటు డిపోను ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసుల ఏర్పాటుకు కృషి చేసిన ఆయన సేవలు మరువలేనివన్నారు. మంగళగిరికి ఆర్టీసీ డిపోకు బదిలీపై వెళ్లడం బాధాకరమైనా ఉద్యోగ బాధ్యతని అన్నారు. అభినందించిన వారిలో ఎంఎన్‌యూ నాయకులు, ఆర్టీసీ సూపర్‌వైజర్ నాయక్, వీరారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పేలుడు పదార్థాల వాహనం స్వాధీనం

పిడుగురాళ్ల: అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న పేలుడు పదార్థాల వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ శ్రీరామ్ తెలిపారు. పిడుగురాళ్ల బైపాస్ రోడ్డు క్వారీ సమీపంలో అనుమతులు, బిల్లులు లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేలుడు పదార్థాలను తెలంగాణ రాష్ట్రం చిట్యాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను సీతారాజు అంజయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పేలుడు పదార్థాల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. క్వారీలో వాడే పేలుడు పదార్థాలకు తప్పని సరిగా అనుమతులు, లైసెన్సులు ఉండాలని, అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: ప్రమాదవశాత్తు కాలువలో పడి పెదచెరువు ప్రాంతానికి చెందిన గుంజి అంకమ్మరావు(35) మృతిచెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూ టౌన్ పోలీసుల వివరాలు ప్రకారం. పెద్ద చెరువు ఐదో లైన్‌లో నివాసం ఉంటున్న అంకమ్మరావు పెయింట్ పనులు చేస్తుంటాడు. పెద్ద చెరువు ప్రారంభం మార్గంలో ఉన్న అన్న క్యాంటీన్ ప్రక్కన ప్రధాన సైడ్ కాలవలో పడి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజల సమస్యల పరిష్కారం కోసం చర్యలు



30వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

మాచర్ల: పట్టణంలోని సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబు శుక్రవారం ఉదయం గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఖాళీ ప్రదేశాల్లో పేరుకున్న పిచ్చిచెట్లను తొలగించారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. కాలువల్లో పూడిక తొలగింపు పనులను కమిషనర్ వేణుబాబు, పురపాలక సంఘ అధికారులు, ఏఈ రాఘవేందర్, సుభాని తదితరులు దగ్గరుండి పర్యవేక్షించారు.

రైతుల సమస్యలకు వెంటనే పరిష్కారం



మిట్టగుడిపాడు గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ

మిట్టగుడిపాడు(రెంటచింతల):గ్రామాలలో నిర్వహిస్తున్న గ్రామ సభలలో రీసర్వేకు సంబంధించి అర్జీలు ఇచ్చే రైతుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ చెప్పారు. శుక్రవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆర్డీఓ మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి ఏమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు అర్జీలు ఇచ్చినట్టయితే వారి సమస్యలను స్థానిక రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు 25 అర్జీలను అందజేయగా వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సభలో తహసీల్దార్ కె.నగేష్, ఆర్ఐ పల్లా రామకృష్ణ, వీఆర్వో కాశయ్య, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో జరిమానా, జైలు

నరసరావుపేటటౌన్: దాడి కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 1000 రూపాయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పలపాడు గ్రామానికి చెందిన శివన్నారాయణ 2018 ఫిబ్రవరి 27న ఆస్తివివాదాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వీర్ల అంకయ్య పై దాడి చేశాడు. ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో జరిమాన విధించారు.

మరొకరికి జైలు, జరిమానా

దాడి కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ.1000 రూపాయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదం పాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి . గురవాయపాలెం గ్రామానికి చెందిన లేవయ్యా ఆస్తి వివాదాల నేపథ్యంలో 2018 సెప్టెంబర్ 15న అదే గ్రామానికి చెందిన పాలెపోగు కోటి రత్నం మహిళపై వెదురు బొంగుతో దాడి చేసి, దూషించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న గ్రామీణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం సీఆర్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 35 ఏళ్లు వయస్సు గల వ్యక్తి గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో గణపవరం సీఆర్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుంటూరు వైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొనటంతో సంఘటనా స్థలంలోనే మరణించాడు. ఢీకొన్న వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలియరాలేదు. మృతుడు ఒడిషా, బీహార్ రాష్ట్రాలకు చెందిన కూలీగా భావిస్తున్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకట రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఆరోగ్య కేంద్రంలో వసతులు, రోగులకు అందుతున్న సేవలు పరిసరాలు పరిశుభ్ర త, ల్యాబ్ ద్వారా రోగులకు అందుతున్న ఆరో గ్య సేవలపై వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. అలాగే వైద్యశాల్లో వైద్యాధికారులు సిబ్బంది పనితీరు సమయపాలన రికార్డులు తనిఖీ చేశామన్నారు. నివేదికను జిల్లా కలెక్టరు కు పంపుతామన్నారు. ఆయనతో పాటు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సులు లక్ష్మిప్రసన్న, ధనలక్ష్మి పాల్గొన్నారు.

21న గణపవరంలో విగ్రహ ప్రతిష్ట



గణపవరంలో నూతనంగా నిర్మించిన ఆలయం



గంగమ్మతల్లి విగ్రహం



పోతురాజు విగ్రహం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో శ్రీగంగమ్మ తల్లి పోతురాజుస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 21న జరగనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామం నుంచి అప్పాపురం వెళ్ళేడొంక రోడ్డులో సువిశాల విస్తీర్ణంలో ఆలయంతో పాటూ రెండు విశ్రాంతి గదులు నిర్మించారు. ఈ నెల 19 నుంచి ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమా లు ప్రారంభం కానున్నాయి. 19న ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశం, అంకురారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసం జరగనున్నాయి. 20న ఆదివారం వాస్తు పూజా హోమంతో పాటూ దేవతామూర్తులకు క్షీరాదివాసం, విశేష పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 21న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం జరగనుంది. అదేరోజు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయంలో ప్రతిష్ఠించే పోతురాజు, గంగమ్మతల్లి విగ్రహాలను చిలకలూరిపేట పట్టణ పరిధిలోని పురుషోత్తమ పట్నంలోని శిల్పశాలలో తయారు చేయించి ఆలయానికి తరలించారు. ఆలయం వద్ద శాంతి హోమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.